
# సాక్షి ఒడిశా

గురువారం। 14। డిసెంబర్। 2023



## శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ.3,56,086 |
| బంగారం | 1 గ్రాము 250 మిల్లీ గ్రాములు |
| వెండి | 600 మిల్లీ గ్రాములు |

- భువనేశ్వర్/పూరీ



## అలరించిన సాంస్కృతిక నృత్యాలు

కార్తీక మాసం ముగింపు సందర్భంగా బోలి పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాయగడ బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి.

- IIలో▸



## రైతులకు నష్ట పరిహారం అందించాలి

గజపతి జిల్లాలో మిచాంగ్‌తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్ ఒడిశా కమిటీ అధ్యక్షుడు జెన్న సుభాష్ చంద్రరావు డిమాండ్ చేశారు.

- IIలో▸

న్యూస్‌రీల్

## ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సంఘమిత్రాదేవి తదితరులు

రాయగడ: ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవ్వనున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల్లో అవగాహన, చైతన్యం కలిగించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు స్థానిక నియంత్రిత బజార్ కమిటీ (ఆర్‌ఎంసీ) కార్యాలయం ప్రాంగణంలో ప్రచార రథాన్ని బుధవారం ప్రారంభించారు. ఆర్‌ఎంసీ చైర్మన్, రాయగడ సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రచార రథానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయగడ సబ్ డివిజన్ పరిధిలోని కొలనార, కాసీపూర్, రాయగడ, కల్యాణ సింగుపూర్ సమితుల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 11 మండీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఎంసీ కార్యదర్శి బిపిన్ బిహారి స్వయి మాట్లాడుతూ మండీలకు రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని భద్రపరిచేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో ఫార్మసిస్ట్ మృతి





ప్రమాదంలో నుజ్జు నుజ్జైన కారు, (ఇన్‌సెట్లో) మృతుడు సుభీర్ సాహు (ఫైల్)

కొరాపుట్: ట్రక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఫార్మసిస్ట్ మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి మిన్నాపాయి ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితిలో పని చేస్తున్న ఫార్మాసిస్ట్ సుభీర్ సాహు(49) మృతి చెందాడు. తీవ్రమైన పొగమంచు వలన ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణం చేస్తుండడంతో అందరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సుబీర్ సాహు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగతా వారి పరిస్థితి విషమించగా వారిని విశాఖపట్నం తరలించారు. సుబీర్ ప్రస్తుతం నబరంగ్‌పూర్ జిల్లా ప్రభుత్వ ఫార్మాసిస్ట్‌ల యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు.

## కళాశాల ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విద్యార్థినులు

జయపురం: పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ తనను లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఆ కళాశాలలో చదువుతున్న సైన్స్ విద్యార్థిని మరికొంతమందితో కలిసి జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. గత 8 ఏళ్లుగా తనను పరీక్షలో ఫెయిల్ చేస్తానని బెదిరిస్తూ అత్యాచారం చేస్తున్నాడని విద్యార్థిని ఆరోపించింది. ఈనెల 2, 3 తేదీల్లో కళాశాలలోనే లైంగికంగా వేధించి అత్యాచారం చేసినట్లు పేర్కొంది. ప్రిన్సిపాల్ లైంగిక, మానసిక వేధింపుల వలన కొంతమంది విద్యార్థినులు కళాశాల విడిచి పోయారని, అంతేకాకుండా ఒక విద్యార్థిని గర్భవతి అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని తల్లి కళాశాలకు రాగా తనపై ప్రిన్సిపాల్ అత్యాచారం జరిపినట్లు తల్లితో మొరపెట్టుకుంది. ఆ తల్లి ప్రిన్సిపాల్ వద్దకు వెళ్లి నిలదీయగా వారి మధ్య వాదోపవాదనలు జరిగాయి. అనంతరం ఆ విద్యార్థిని తల్లి, మరికొంతమందితో కలిసి జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు అధికారి సత్యానంద పాత్రో కళాశాలకు వెళ్లగా ప్రిన్సిపాల్ పరారయ్యాడు. కళాశాలలో ఒక ఉద్యోగిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. వివరాలు తెలపాలని కోరగా కేసు దర్యాప్తు జరుపుతున్నామని పోలీసు అధికారి పేర్కొన్నారు.

# సందడే.. సందడి



డాన్సులు చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి జిల్లాస్థాయి మాల్యవంత్ ఉత్సవాల్లో భాగంగా స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి డీఎన్‌కే కూడలి వరకు బుధవారం రోడ్ షో సందడిగా సాగింది. కార్యక్రమాన్ని మల్కన్‌గిరి అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, చిత్రాలు, డాగ్ షో, చిన్నారులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖేముండు, డీఐపీఆర్వో ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు.

- మల్కన్‌గిరి







చిన్నారులు వేసిన రంగవల్లులు



రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్



బొమ్మలు వేస్తున్న వేస్తున్న యువత



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు



సంబల్‌పూరీ నృత్యాలు చేస్తున్న బాలికలు



ఆదివాసీ నృత్యం చేస్తున్న విద్యార్థులు



డాగ్ షో నిర్వహిస్తున్న దృశ్యం



యువతుల ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు

## క్రైస్తవ శ్మశానవాటిక పరిరక్షణకు వినతి



వినతిపత్రం పరిశీలిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: జట్నీ క్రైస్తవ శ్మశానవాటిక పరిరక్షణకు చొరవ తీసుకోవాలని క్రైస్తవ ఖనన సంఘం (సీబీఎస్) రాష్ట్ర గవర్నర్‌ను అభ్యర్థించింది. ఈ సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్‌తో బుధవారం రాజ్ భవన్‌లో భేటీ అయింది. ఖుర్దారోడ్ (జట్నీ) ప్రాంతంలో క్రైస్తవ కుటుంబీకుల కోసం ఒకే ఖనన కేంద్రం అందుబాటులో ఉంది. ఈ ప్రాంతం స్థానికుల అమానుష చర్యలతో దుర్గంధమై పర్యావరణ కాలుష్యాన్ని ప్రేరేపిస్తోంది. పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న యజమానులు పట్టణ, నగర పరిమితులు అధిగమించి అవాంఛిత ఆక్రమణకు పాల్పడడంతో ఈ పరిస్థితి తాండవిస్తోంది. ఈ పరిస్థితిపై చర్యలు చేపట్టాలని గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఖనన కేంద్రం దాదాపు 120 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి ఉందని వివరించారు. దీనిపై సుమారు 2 వేల క్రైస్తవ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు.

## సంచార చిత్రకళ ప్రదర్శన



సంచార చిత్రకళ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సంచార చిత్రకళ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఒడిశా భాష, సాహిత్యం, సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల 40 చిత్రకళ పటాలను ప్రదర్శించారు. కొరాపుట్ జిల్లా సాంస్కృతిక అధికారి ప్రీతి పృథ జెన ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో ప్రముఖ చిత్రకారులు బినోద్ రౌత్‌రాయ్, ఎస్.చంద్రశేఖరరావు, డి.దీనానాథ్ పాఠి, డి.నారాయణరావు, రామ హరిజెన, అక్షయ కుమార్ పట్నాయక్, అమర కుమార్ జెన, అశీత్ కుమార్ పట్నాయక్ తదితరుల చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కార్యక్రమంలో అనేక మంది సందర్శకులు పాల్గొన్నారు.

## మెట్రిక్ పరీక్షల టైం టేబుల్ విడుదల

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) ఆధ్వర్యంలో జరగనున్న వార్షిక హైస్కూల్ సర్టిఫికెట్ (హెచ్‌ఎస్‌సీ) మెట్రిక్యులేషన్ పరీక్షలు - 2024 టైం టేబుల్ బుధవారం విడుదల చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 నుంచి ఈ పరీక్షలు ప్రారంభమవుతాయని బీఎస్‌ఈ తెలియజేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,991 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తారు. మార్చి 4వ తేదీతో ఈ పరీక్షలు ముగుస్తాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 5 ,51,611 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. నిత్యం ఒక సిటింగ్‌లో పరీక్ష నిర్వహిస్తారు. గణితం పరీక్షకు అదనంగా 15 నిముషాల నిడివి కేటాయిస్తారు.

**మూల్యాంకనం**

పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియ చేపడతారు. ఈ మేరకు కార్యక్రమం ఖరారైనట్లు బోర్డు పేర్కొంది. జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియ మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ కనీసం 12 రోజుల పాటు కొనసాగుతుందని బోర్డు సమాచారం.

| పరీక్షల టైం టేబుల్ | |
|---|---|
| తేదీ | పరీక్ష సబ్జెక్టు |
| ఫిబ్రవరి 20 | ప్రథమ భాష |
| ఫిబ్రవరి 23 | ద్వితీయ భాష (ఇంగ్లిష్) |
| ఫిబ్రవరి 26 | గణితం |
| ఫిబ్రవరి 28 | తృతీయ భాష (హిందీ, ఒడియా, సంస్కృతం) |
| మార్చి 2 | విజ్ఞాన శాస్త్రం |
| మార్చి 4 | సామాజిక శాస్త్రం |

## వీధి కుక్క దాడిలో బాలుడి దుర్మరణం

- రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశం

భువనేశ్వర్: వీధి కుక్క దాడిలో బాలుడు మరణించిన విషాద ఘటనపై రాష్ట్ర హైకోర్టు ఘాటుగా స్పందించింది. భారీ మొత్తం పరిహారంగా చెల్లించాలని స్థానిక మున్సిపాలిటీకి ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. 2016 సంవత్సరం డిసెంబర్ నెలలో వీధి కుక్క దాడి చేయడంతో నాలుగేళ్ల బాలుడు మరణించాడు. బాలుని తల్లిదండ్రులు రోజు కూలీలు. దీంతో మరణించిన బాలుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఒడిశా హైకోర్టు బుధవారం పూరీ మున్సిపాలిటీని ఆదేశించింది. న్యాయవాది బిభూతి చరణ్ మహంతి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపిన తర్వాత హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగి, జస్టిస్ ఎం.ఎస్.రామన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇదీ విషయం**

పూరీ పట్టణం కుంభారపడా పోలీసుస్టేషన్ పరిధి జగన్నాథ్ కాలనీలో ఇంటి దగ్గర ఆడుకుంటున్న 4 ఏళ్ల బాలుడు సత్యబ్రత రౌత్‌పై వీధి కుక్క దాడి చేయడంతో గాయపడి మృతి చెందాడు. ఈ విచారకర సంఘటన 2016 సంవత్సరం డిసెంబర్ 1న జరిగింది. దీంతో బాలుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని న్యాయవాది బిభూతి చరణ్ మహంతి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రూ.10 లక్షల పరిహారం చెల్లించడం తమ పరిధిలో లేదని ప్రత్యర్థి పక్షం పూరీ మున్సిపాలిటీ పేర్కొంది. ఈ పరిస్థితుల్లో మృత బాలుని కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30 వేలు, రెడ్‌క్రాస్ సంస్థ నిధి నుంచి రూ.20 వేలు పరిహారంగా చెల్లించినట్లు హైకోర్టుకు పూరీ మున్సిపాలిటీ తెలియజేసింది. పైన పేర్కొన్న మొత్తం సరిపోదని పిటిషనర్ వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగి, జస్టిస్ ఎం.ఎస్.రామన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మృత బాలుని కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. 2022 సంవత్సరం జూలై 1న కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ 2018 సంవత్సరంలో వీధి కుక్కల గుంపుతో చంపబడిన రెండేళ్ల చిన్నారి తల్లిదండ్రులకు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తాజా కేసు విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకుని రావడం విశేషం. ముఖ్యంగా తాజా పిటిషన్ 2016 సంవత్సరం డిసెంబర్ 3న దాఖలు చేయగా హైకోర్టు తొలుత 2017 సంవత్సరం జనవరి 24న పూరీ మున్సిపాలిటీకి తాఖీదులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 4వ తేదీన హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ 6 ఏళ్ల సుదీర్ఘ వ్యవధిలో సంబంధిత మున్సిపాలిటీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టనట్లు ధర్మాసనం ధ్రువీకరించింది.

## బ్యాంక్ ముందు బారులు



సాధారణంగా బ్యాంక్‌ల పనివేళలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. ఆ సమయానికే ఖాతాదారులు వస్తారు. కానీ అసాధారణంగా నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ వద్ద వందలాది మంది ప్రజలు ఖాతాలు తెరవడానికి బారులుతీరిన పరిస్థితి బుధవారం కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం బిజూ కృషక్ యోజన పథకం క్రింద రైతులు తమ సొంత భూముల్లో బోర్లు వేసుకోవడానికి ఆర్థిక సాయం అందజేస్తోంది. దీనికి గిరిజనులు రూ.10 వేలు, గిరిజనేతరులు రూ.20 వేలతో ఖాతా తెరవాలి. దీనికోసం ఈనెల 16వ తేదీనే చివరి రోజు కావడంతో ప్రజలు బ్యాంకుకు ఎగబడుతున్నారు. జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో అర్హులైన లబ్ధిదారులు ఉండగా బ్యాంక్ శాఖలు మాత్రం మూడే ఉన్నాయి. అందులోనూ సిబ్బంది సంఖ్య తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరవడానికి అవకాశం ఉన్నప్పటికీ నిరక్షరాస్యులు ఎక్కువ కావడంతో ఈ సమస్య పెరిగింది. ఖాతాదారులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి పోలీసులు రంగంలోకి దిగారు.

- కొరాపుట్

## క్లుప్తంగా


### గంజాంలో పర్యటించనున్న పాండియన్



సమావేశం నిర్వహిస్తున్న బీజేడీ నాయకులు

బరంపురం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని సర్క్యూట్ హౌస్‌లో గంజాం బీజేడీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజీపూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ పథకాల బోర్డు అధ్యక్షుడు ప్రణబ్ ప్రకాష్ దాస్ మాట్లాడుతూ ఈనెల 16, 17వ తేదీల్లో 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ గంజాం జిల్లాలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. పర్యటనను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర, జమ్ముల నారాయణ, పులసర ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు, సురడా ఎమ్మెల్యే పూర్ణచంద్ర స్వాంయి, కొదల ఎమ్మెల్యే లికిత ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

### పాలిథిన్ కర్మాగారంలో దొంగతనం



పాలిథిన్ కర్మాగారంలో దర్యాప్తు చేపడుతున్న పోలీసులు

జయపురం: స్థానిక సదర్ పోలీసుస్టేషన్ పరిధి బంకబిజ గ్రామ ప్రాంతంలోని పాలిథిన్ కర్మాగారంలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. కర్మాగారంలోని అనేక వస్తువులను దొంగలు దోచుకెళ్లినట్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు జరుపుతున్నట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి వెల్లడించారు. ఈ కర్మాగారం చట్ట విరుద్ధంగా నడుపుతున్నారనే కారణంతో 3 నెలల క్రితం పొల్యూషన్ కంట్రోలు బోర్డు బృందం సీజ్ చేశారు. కాగా బుధవారం షట్టర్ తెరిచి ఉండడంతో గమనించిన స్థానికులు వెంటనే యజమానికి తెలియజేశారు. సమాచారం అందిన వెంటనే యజమాని ఎ.సి.ముని కర్మాగారానికి వచ్చి వస్తువులు దొంగతనానికి గురైన విషయం పరిశీలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గగనాపూర్ పోలీసు పంటి అధికారి రాజకిశోర్ బారిక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు గిరిధర్ ఎంపిక



ధర్మాన గిరిధర్‌ను అభినందిస్తున్న ఐడీవీ ప్రసాద్, సతీష్‌రాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ధర్మాన గిరిధర్ ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి 23 వరకు దేశ రాజధాని ఢిల్లీలో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ధర్మాన గిరిధర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. అంతకుముందు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జట్టు తృతీయస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో గిరిధర్ మెరుగైన ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ పీడీ రాజనాల సతీష్‌రాయుడు తెలిపారు. విద్యార్థితో పాటు పీడీని హెచ్‌ఎం ఐడీవీ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మొయ్యిల వాసుదేవరావు, గ్రామపెద్దలు బాణాల గాంధీ, పంచిరెడ్డి అప్పలనాయుడు, బాణాల బలరాం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

### దివ్యాంగులను ప్రోత్సహించాలి

ఎచ్చెర్ల : దివ్యాంగులకు ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారని ఎంఈఓ కారు పున్నయ్య అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలోని భవిత కేంద్రం వద్ద దివ్యాంగులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 గాలి రాజకిషోర్, ఐఈఆర్‌టీలు కె.అరుణకుమారి, ఎస్.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

### భద్రత పటిష్టపరచాలి

శ్రీకాకుళం కల్చరల్: భారత లోక్‌సభ జరుగుతున్న సమయంలో ఇద్దరు ఆగంతకులు గేలరీ నుంచి దూకిన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం జాతీయ అధ్యక్షుడు చౌదరి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్మన పురుషోత్తం, ఉపాధ్యక్షుడు డి.ఎ.స్టాలిన్, కోశాధికారి కొప్పల సూర్యనారాయణ, కార్యదర్శి పారశెల్లి రామరాజు, కార్యవర్గ సభ్యులు కె.తిరుమలరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్టపరచాలని వారు కోరారు.

# అలరించిన సాంస్కృతిక నృత్యాలు




సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అన్నప్రసాదానికి బారులుతీరిన భక్తులు

రాయగడ:

కార్తీక మాసం ముగింపు సందర్భంగా పోలి పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. స్పందన సాహితీ సాంస్కృతిక నృత్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. అంతకుముందు ఆలయంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యులచే విశేష పూజలు జరిగాయి. అనంతరం ప్రసాద సేవన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని సుమారు పది వేల మంది భక్తులు అన్నప్రసాద సేవన కార్యక్రమంలో పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న గీతిక



తనుష్క నృత్య ప్రదర్శన



రమ్య నృత్య ప్రదర్శన

### అంకితభావంతో పనిచేద్దాం



రంధి మనోజ్ బాబు

భువనేశ్వర్: జాతి పురోగతికి అంకితభావంతో పనిచేద్దామని అతి విశిష్ట రైలు సేవా పురస్కారం విజేత రంధి మనోజ్ బాబు అన్నారు. ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీ ప్రగతి మైదాన్ ప్రాంగణంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో రైల్వే శాఖ మంత్రి చేతులమీదుగా ఆయన ఈ అవార్డుని అందుకోనున్నారు. తూర్పు కోస్తా రైల్వేలో ఈ విశిష్ట పురస్కారం అందుకుంటున్న ఏకైక వ్యక్తి ఆయన. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణ రంగంలో అంకితభావంతో జాతి సమగ్ర పురోగతికి వారధిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రైలు మార్గంలో సరుకు రవాణా వ్యవస్థ నిరంతర మెరుగుదల అత్యంత కీలకమన్నారు. తొలినాటి అనుభవాలే జీవితంలో పదునైన నిర్ణయాలను దృఢపరుస్తాయని పేర్కొన్నారు. లోగడ తాల్చేరు, పారాదీప్ ప్రాంతాల్లో పని చేసిన అనుభవంతో ఖుర్దారోడ్ మండలం సరుకు రవాణాలో అత్యున్నత ఫలితాలు సాధించడం సులభతరమైందన్నారు. పురస్కారం అందుకోనున్న ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## రైతులకు నష్ట పరిహారం అందించాలి




కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్న బీకేఎంయూ కార్యకర్తలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మిచాంగ్‌తుఫాన్ వలన కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని, ఒడిశాలో వృద్ధాప్య పింఛన్లు రూ.500 నుంచి రూ.5 వేల వరకూ పెంచాలని డిమాండ్ చేస్తూ భారతీయ ఖేత్ మజ్దూర్ సంఘ్ ఒడిశా కమిటీ అధ్యక్షుడు జెన్న సుభాష్ చంద్రరావు డిమాండ్ చేశారు. జిల్లాలో ఆదివాసీలకు భూపట్టాలు, పేదలకు 35 కిలోల బియ్యం, 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని కోరుతూ ఆందోళన జరిపారు. తొలుత అగ్నిమాపక దళం జంక్షన్ నుంచి ర్యాలీగా వచ్చిన బీకేఎంయూ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆందోళనలో సీపీఐ కార్యకర్త, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి ఎం.జగన్నాథం, పి.పద్మ, ఆదివాసీ సంఘం అధ్యక్షుడు ఇస్మాయిల్ శోబోరో, హేమంత్ శోబోరో, ఏఐటీయూసీ నాయకుడు కామేశ్వర బెహరా తదితరులు పాల్గొన్నారు.

### కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో సుమారు రెండు లక్షల జనాభా కలిగి బడుగు, బలహీన వర్గాలుగా ఉన్న శ్రీశయనుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కల్లు గీత కార్మికులకు చెట్లు లభ్యత తగ్గిపోవడంతో జీవనాధారం కష్టమైందని, సుమారు 80 శాతం మం అసంఘటిత కార్మికులుగా బతుకు వెళ్లదీస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు పథకాలు అందిస్తున్నప్పటికి శాశ్వతంగా జీవనోపాధి కల్పించే దిశగా ప్రయత్నం చేయాలన్నారు.

# పోలిపాడ్యమి పూజలు



విజయనగరం రింగురోడ్డులోని కళ్యాణవెంకటేశ్వరస్వామి ఆలయంలోని కోనేటిలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు



మెంటాడ: చంపావతి నదీ తీరంలో దీపాలు పెడుతున్న మహిళలు



జ్ఞానసరస్వతి అక్షరాభ్యాస మండపంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు నిర్వహకులు


కార్తీకమాసం ముగిసిన వేళ.. పోలిపాడ్యమినాడు మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ బుధవారం వేకువజాము నుంచి భక్తులు శైవ, వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నదీ తీరాలకు చేరుకుని దీపారాధనలు జరిపారు. అరటి తెప్పలపై దీపాలు వెలిగించి నదులు, పుష్కరిణిలలో విడిచిపెట్టారు. ఆరోగ్యభాగ్యం కలగాలని ప్రార్థించారు.

– విజయనగరంటౌన్/మెంటాడ




మహిళల దీపారాధన

# ఉత్తమ ఫలితాలకు 100 రోజుల ప్రణాళిక




విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర విద్యార్థులు అంతర్జాతీయ అవకాశాలు అందుకునేలా పాఠశాల స్థాయి నుంచే పటిష్టమైన విద్యా ప్రణాళికలు అమలుచేస్తోంది. విప్లవాత్మక సంస్కరణలతో విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తోంది. బోధనకు, అభ్యసనకు అనువుగా విద్యాలయాలను తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ... జిల్లా విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా కలెక్టర్ నాగలక్ష్మి సూచనల మేరకు డీఈఓ లింగేశ్వరరెడ్డి వంద రోజుల ప్రణాళికను పాఠశాలల్లో అమలుచేస్తున్నారు. పదోతరగతిలో శతశాతం ఫలితాల సాధనతో పాటు అధికమంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించేలా సెల్ఫ్ ఎవెల్యూషన్ ఫర్ లెర్నింగ్ అండ్ ఫ్యూచర్ (సెల్ఫ్) పేరుతో వినూత్న కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సెబ్జెక్టుకు ఆరుగురు చొప్పున నిష్ణాతులైన 42 మంది టీచర్లు, ఏడుగురు ప్రధానోపాధ్యాయులు, డీసీఈబీ కార్యదర్శి మొత్తం 50 బృందంతో చదువు ప్రణాళికను రూపొందించారు. దీని ప్రకారం ఈ నెలాఖరుకు సిలబస్ పూర్తిచేయనున్నారు.



**సబ్జెక్టు వారీగా పరీక్షలు**

సబ్జెక్టు వారీగా మొత్తం సిలబస్‌ను ఏడు భాగాలుగా చేశారు. ఒక్కో భాగం పూర్తి చేయడానికి నిర్ణీత సమయం కేటాయించారు. పాఠ్యాంశ బోధన పూర్తయిన వెంటనే సెల్ఫ్ టెస్టులు నిర్వహించారు. ఒక్కో టెస్ట్‌కు గంట సమయం కేటాయిస్తూ 20 మార్కులకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 264 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 24,337 మంది పదోతరగతి విద్యార్థులకు ఈ సెల్ఫ్ టెస్టుల షెడ్యూల్ ఇటీవల ముగించారు. వీటితో పాటు ఇటీవల ముగిసిన ఎస్.ఏ–1 పరీక్షకు ముందు ప్రిపరేషన్‌లో భాగంగా ప్రీ ఎస్ఏ–1 మోడల్ పరీక్షను కూడా నిర్వహించారు. మాన్యువల్‌గా నిర్వహించే ఈ పరీక్షకు అవసరమైన ప్రశ్నపత్రాల మెటీరియల్ జిల్లా పరీక్షల నిర్వహణ మండలి (డీసీఈబీ), జిల్లా విద్యాశాఖ స్వీయ ఖర్చుతో అందజేసింది.

**తాజాగా వంద రోజుల ప్రణాళిక విడుదల**

సెల్ఫ్ ప్రణాళికలో భాగంగా సిలబస్ పూర్తయిన తర్వాత అమలుచేయాల్సిన 100 రోజుల ప్రణాళికను విద్యాశాఖ అధికారులు సిద్ధంచేశారు. సెల్ఫ్ కొనసాగింపుగా చేపడుతున్న ఈ ప్రణాళికలో మూడు సెల్ఫ్ టెస్టులు ఉంటాయి. మొత్తం 7 భాగాల సిలబస్‌ను కలిపేసి మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక్కో భాగంపై టీచర్ ఇచ్చిన రెండోసారి బోధనల అనంతరం పబ్లిక్ పరీక్ష మాదిరిగా 100 మార్కులతో ఒక సెల్ఫ్ టెస్ట్ పెడతారు. ఇలా మూడు టెస్టులు పూర్తయిన తరువాత మొత్తం సిలబస్‌పై మూడు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. చివరిగా మొత్తం సిలబస్ మీద ఒక సెల్ఫ్ ప్రీ ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఏడాదిపాటు నిర్వహించిన సెల్ఫ్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు కలుపుకొని ఒక్కో సబ్జెక్టుకు 640 మార్కుల ప్రశ్నావళిని విద్యార్థులు ప్రిపరేషన్‌గా ఎదుర్కొంటారు.




నగరంలోని కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సెల్ఫ్ టెస్టులకు రాస్తున్న విద్యార్థులు

### 100 రోజుల ప్రణాళికలో పాటించాల్సినవి


పదోతరగతి ఫలితాల్లో నిర్దేశిత లక్ష్యం చేరుకునేందుకు వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలుచేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఇటీవల జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలో అమలు చేస్తున్న సెల్ఫ్ ప్రణాళిక కొనసాగింపుగా 100 రోజుల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు పాటించాల్సిన అంశాలను జిల్లా విద్యాశాఖ ప్రకటించింది.

- మొదటిగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ 100 రోజుల ప్రణాళికను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.
- సబ్జెక్టు వారీగా ఏ సబ్జెక్టుకు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో దానికి అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు స్వీయ ప్రణాళికలు వేసుకోవాలి.
- తల్లిదండ్రులు, విద్యార్థులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి వందరోజుల ప్రణాళిక అమలు ప్రాధాన్యతను వివరించి వారిని సంసిద్ధం చేయాలి.
- ప్రతి సెల్ఫ్ పరీక్ష నిర్వహించిన వెంటనే మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలి. వారు చేసిన తప్పులను వివరించి నోట్స్‌లో సరైన సమాధానాలు రాసి పూర్తిస్థాయిలో సాధన చేయించాలి.
- సెల్ఫ్ టెస్ట్ పూర్తయిన తరువాత అన్ని సబ్జెక్టుల్లో ఫలితాలను విశ్లేషించి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించాలి. ఫలితాలు తక్కువ వచ్చిన సబ్జెక్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తదుపరి కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి అమలు చేయాలి.
- 100 రోజుల ప్రణాళికను తల్లిదండ్రులకు తెలియజేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విద్యార్థి ఇంటిని సందర్శించాలి.
- విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయుల తల్లిదండ్రులతో వారి ప్రగతి గురించి మాట్లాడిస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి వారిని భాగస్వామ్యం చేయాలి.




### ఏడాదిలో 434 గంటల స్టడీ క్లాసెస్

సెల్ఫ్ ప్రణాళిక అమలు నేపథ్యంలో పదో తరగతికి పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు ప్రతి రోజు అదనంగా బోధనా తరగతులను విద్యాసంవత్సరం తొలిరోజు నుంచి నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ క్లాసెస్ చేపట్టారు. సాధారణంగా ఉన్నత పాఠశాలలో ఏడాదికి వెయ్యి గంటల బోధనా తరగతులు ఉంటాయి. ఈ స్టడీ క్లాసెస్, సెల్ఫ్ టెస్టులను కలుపుకొని అదనంగా మరో 434 గంటల సమయాన్ని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు అభ్యసన సాగిస్తున్నారు. ఇది ఫలితాలపై మంచి ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



### అధిక మార్కుల సాధనే లక్ష్యం



వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో శతశాతం ఫలితాలతో పాటు ప్రతి ఒక్కరూ 500 పైబడి మార్కులు సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీనికోసం సెల్ఫ్ అనే ప్రోగ్రాం జిల్లా విద్యాశాఖ యంత్రాంగం రూపొందించింది. దానిని అమలు చేస్తూ విద్యార్థి ప్రగతిని ప్రతి 15 రోజులకు నివేదిస్తారు. డివిజన్ పరిధిలో డిప్యూటీ ఈఓలు, మండల పరిధిలో ఎంఈఓ–1, 2 పర్యవేక్షణలో ఈ ప్రణాళికను అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

## క్లుప్తంగా

### లారీ ఢీ కొని నాలుగు ఆవుల మృతి

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో పశువుల మందను లారీ ఢీకొన్న సంఘటనలో నాలుగు ఆవులు అక్కడికక్కడే దుర్మరణం చెందాయి. మరో రెండు ఆవులు, ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి నివగాం నుంచి సీతంపేట వైపు పశువులను రహదారిపై ఓ వ్యక్తి తోలుకుని వస్తుండగా మార్గమధ్యంలో కె.గుమ్మడ సమీపానికి వచ్చేసరికి పాలకొండ నుంచి కొత్తూరు వెళ్తున్న లారీ పశువుల మందను ఢీకొట్టింది. దీంతో జరిగిన ప్రమాదంలో మందలోని నాలుగు ఆవులు మృతిచెందగా మరో రెండు ఆవులకు గాయాలయ్యాయి. పశువులను తోలుకుని వస్తున్న హంసకడుమకు చెందిన కె.వీరయ్యకు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పారా బ్యాడ్మింటన్‌లో రూపాదేవి ప్రతిభ



తాను సాధించిన సిల్వర్ మెడల్ చూపుతున్న రూపాదేవి

రాజాం సిటీ: ఖేలో ఇండియాలో భాగంగా నిర్వహించిన పారా బ్యాడ్మింటన్ పోటీల్లో రాజాంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని పడాల రూపాదేవి ప్రతిభ కనబరిచింది. ఈ నెల 10 నుంచి 12 వరకు ఢిల్లీలో జరిగిన పోటీల్లో రూపాదేవి పాల్గొని సిల్వర్ మెడల్ సాధించిందని ప్రిన్సిపాల్ స్వప్నహైందవి బుధవారం తెలిపారు. ఆమె ప్రతిభ పట్ల అధ్యాపకులతోపాటు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతి నిధులు అభినందించారు.

### రమణ మహర్షి సూక్తులు అనుసరణీయం



రమణ మహర్షి ఆశ్రమంలో శివలింగాభిషేకం చేస్తున్న రుద్రాక్షస్వామి

బొబ్బిలి: భగవాన్ రమణ వాశిష్ట మహాముని సూక్తులు అనుసరణీయమని అరుణాచల రుద్రాక్షస్వామీజీ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కలువరాయిలో ఉన్న రమణ మహర్షి వాశిష్ట గణపతి మహాముని ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ఆశ్రమంలో శివలింగాభిషేకం చేశారు. కార్యక్రమంలో సన్యాశిరావు తదితరులు పాల్గొన్నారు.

### సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట: మండలంలోని దోనుబాయి జంక్షన్ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న పది లీటర్ల సారాను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ కేసులో పాలకొండకు చెందిన శేషపు రామినాయుడిని అరెస్టు చేశామని చెప్పారు.

### పోలీసుల అదుపులో ఆవుల లారీ



పోలీసుల అదుపులో ఉన్న ఆవుల లారీ

పూసపాటిరేగ: ఆవుల లోడుతో వెళ్తున్న లారీని పూసపాటిరేగ మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్‌లో జాతీయరహదారిపై ఎస్సై జి.బాలకృష్ణ బుధవారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు 54 ఆవుల లోడుతో వెళ్తున్న భారీ లారీని అదుపులోకి తీసుకుని బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలియజేశారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని కొత్తవలస గ్రామానికి చెందిన యువకుడు కొరికాన మహేశ్వరరావు (24) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. ఈ విషయమై ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహేశ్వర రావు కడుపునొప్పి తాళలేక ఈ నెల 7న గడ్డిమందు తాగేసి వాంతులు చేసుకుంటుండగా తండ్రి లక్ష్మీనారాయణ గమనించి వెంటనే రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. ఈ మేరకు రిమ్స్‌లో చికిత్స పొందుతూ 12న రాత్రి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# బతుకు భరోసా..

- మహిళలు, యువత సాధికారతకు ఉపాధి మార్గం
- వ్యాపారాలకు సర్కారు సహకారం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక తోడ్పాటుతో సత్ఫలితాలు



ఇట్లామామిడిపల్లిలో పీఎంఈజీపీ ద్వారా డైరీఫారం ఏర్పాటు చేసుకున్న జంగం రాము

రామభద్రపురం: మహిళలు, యువత సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ బతుకుపై ఆశలు కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ, రాష్ట్ర ప్రభుత్వం అమలు



బట్టల వ్యాపారం ద్వారా జీవనోపాధి పొందుతున్న శారద

చేస్తున్న స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. స్వయం ఉపాధి సాధించడంతో పాటు మరి కొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు.

**పీఎంఈజీపీ ఓ వరం**

కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఉపాధి పథకం) అన్ని వర్గాల నిరుద్యోగ యువతకు వరంలా మారింది. బ్యాంకుల సహకారంతో ఇస్తున్న ఈ రుణాలతో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు చూస్తున్నారు. ఈ పథకంలో ఒక్కో యూనిట్ రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఇస్తున్న రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు యువత పెద్ద ఎత్తున ముందు వస్తున్నారు.ఈ పథకంలో 35 శాతం రాయితీతో కుట్టు మెషీన్లు, ఫ్యాషన్ టెక్నాలజీ, హోటళ్లు, ఇంటర్నెట్, డీటీపీసెంటర్, ఫొటో స్టూడియో, కార్లు, మినీ వ్యాన్లు పొందేందుకు బ్యాంకు సహకారం తీసుకుని రుణాలు పొందవచ్చు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఎంఈజీపీ



ఇట్లా మామిడిపల్లిలో కుట్టు మెషీన్ ఏర్పాటు చేసుకున్న లక్ష్మి

పథకం కింద యువతీ యువకులు 290 యూనిట్లకు గాను రూ.6.69 కోట్ల రుణాలు పొందారు. అలాగే పీఎంఎంఈ పథకం కింద రూ.1.26కోట్లతో 52 యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎంఈజీపీ కింద ఇప్పటి వరకు రూ.8.81 కోట్లతో 349 యూనిట్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు.ఇంకా 318 యూనిట్లు బ్యాంకు మంజూరు చేసి ఉండగా మరో 360 యూనిట్లు మంజూరు చేయాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఇప్పటి వరకు రూ.1.17 కోట్లతో 41 యూనిట్లు ఏర్పాటు చేశారు. మరో 8 యూనిట్లు బ్యాంకు యాజమాన్యాలు మంజూరు చేయగా గ్రౌండింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో 30 యూనిట్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయి.



రామభద్రపురంలో పాన్‌షాపు ఏర్పాటు చేసుకున్న చప్ప భవాని



కొట్టక్కిలో వైఎస్సార్ ఆసరాతో చిరువ్యాపారం చేసుకుంటున్న ఉప్పల పద్మావతి

### మహిళా సాధికారతకు ప్రభుత్వం చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మహిళలకు మార్గం చూపుతోంది. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం అందజేస్తోంది. స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.జిల్లాలో నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 31,070 మహిళాసంఘాలలో 3,50,108 మంది మహిళా సభ్యులు రూ.854.45 కోట్లు పొందారు.16,979 మహిళా సంఘాలకు రూ.118.26 కోట్లు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేశారు.సున్నా వడ్డీ కింద 38,125 మహిళా సంఘాలలో 4,31,856 మంది మహిళా సభ్యులకు రూ.119.82 కోట్లు వారి ఖాతాలలో జమ చేశారు. వైఎస్సార్ చేయూత కింద 14,347 మంది మహిళలకు రూ.734.27 కోట్లు అందజేశారు.అలాగే జగనన్న తోడు పథకం కింద 86.214 స్వయం సహాయక సంఘాలకు రూ.87.29 కోట్లు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారంతో మహిళలు అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు, కిరాణా షాపులు, కుట్టు మెషీన్లు, స్వీట్ షాపులు, పిండి మిల్లులు, చిన్న చిన్న బట్టల వ్యాపారాలు పెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

### మహిళలు, యువత సాధికారతే ప్రభుత్వాల ధ్యేయం



మహిళలు, యువత సాధికారతే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. మహిళలు, యువత ఆర్థిభివృద్ధికి సహకారం అందిస్తున్నాయి. వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వాల ఆలోచన. పీఎంఈజీపీలో నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకుంటే బ్యాంకుల సహకారంతో 35 రాయితో రుణాలు మంజూరు చేస్తున్నాం. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని పిలుపునిస్తున్నాం.

– ఎ కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం

# నేతన్నకు ప్రభుత్వం ఊతం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు
- వర్క్‌షెడ్లు, మర మగ్గాలు, సోలార్ లైట్లు పంపిణీ
- బొబ్బిలి క్లస్టర్‌కు రూ.1.8కోట్లు విడుదల



పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో దగాపడిన చేనేత కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పక్కి గ్రామంలో చేనేత కార్మికులకు వర్క్ షెడ్లు, మరమగ్గాలు, సోలార్‌లైట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేనేత పరికరాలను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులను అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఫ్రేమ్‌మగ్గాలు, సోలార్ లైట్లు,వర్క్‌షెడ్ల యూనిట్లకు సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. బొబ్బిలి చేనేత క్లస్టర్‌లోని 172 మందికి రూ.కోటీ 6లక్షల19వేలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఇందులో మొదటి విడతగా పరికరాలు, సబ్సిడీని విడుదల చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన చేనేత రంగాన్ని తమ ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చేనేత జౌళి శాఖ ఎ.డి ఆర్‌వీ మురళీకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి చేనేత క్లస్టర్ పరిధిలో రూ.17వేల విలువ చేసే ఫ్రేమ్‌మగ్గం, 64 యూనిట్ల సోలార్ లైటింగ్ సిస్టమ్‌లు, రూ.20 లక్షల విలువ చేసే వర్క్ షెడ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.లబ్ధిదారులు వాటిని స్వయంగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.వసంత సాయి, నెడ్‌కాప్ సిబ్బంది అజయ్, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి, సర్పంచ్ గంట పైడిరాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

### మామిడి సేకరణ కేంద్రం ప్రారంభం



మామిడిపంటసేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ అధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన మామిడి సేకరణ కేంద్రాన్ని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 60 శాతం మంది రైతులు మామిడి పంటసాగుచేసి జీవిస్తున్నారన్నారు. ఈ కేంద్రాన్ని మండలంలోని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డివేణుగోపాల్‌రావు, కోట్లవిశ్వేశ్వరరావు, బూర్లెనరేష్‌కుమార్, స్థానిక ఎంపీటీసీ ఎస్.సీతారామరాజు, జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎ.వి.ఎస్.వి.జమదగ్ని, చీపురుపల్లి నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి సీహెచ్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుల ప్రతిభ



గెలుపొందిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: ఈనెల 8 నుంచి 10వరకు తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ డీడీ కార్యాలయంలో గెలుపొందిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు 16 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 6 రజత పతకాలను ఉపాధ్యాయులు సాధించారని చెప్పారు. వీఏ భాస్కరరావు (గంగమ్మపేట), ఆర్. గౌరీశ్వరి (లంకాజోడు), పి. చంద్రమోహన్, ఎ. అరుణ (మెండెంఖల్), జనార్దన (సామరిల్లి), ఎస్.ధర్మారావు, ఎ.సన్యాసిరావు (ధర్మలక్ష్మీపురం), ఎ.సూర్యకళ (కె.డి కాలనీ), ఎ.అరుణశ్రీ (లంకా జోడు)లు పాఠశాలల నుంచి తిరుపతిలో జరిగిన క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### హాకీ పోటీలకు అండర్-19 జట్లు పయనం



హాకీ పోటీలకు వెళ్తున్న జిల్లా అండర్-19 జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల హాకీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు బుధవారం పయనమయ్యాయి. ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి బాల, బాలికల జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. పోటీలకు బయలు దేరిన క్రీడాకారులకు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయిలో జరగనున్న పోటీలకు అర్హత సాధించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాల, బాలికల జట్ల కోచ్ అండ్ మేనేజర్‌లతో పాటు పలువురు పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎ.నారాయణరావుకు నియామకపత్రాన్ని అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

### బాక్సింగ్ పోటీల నిర్వహణకు రూ. లక్ష సహాయం

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో అండర్-14, 17, 19 విభాగాల్లో జరగనున్న 67వ అంతర్ జిల్లాల బాక్సింగ్ పోటీల నిర్వహణకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులకు బుధవారం అందజేశారు.

**నైట్ వాచ్‌మన్‌కు నియామక పత్రం**

డెంకాడ మండలంలోని పెదతాడివాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వికలాంగుల విభాగంలో ఎ.నారాయణరావును నైట్ వాచ్‌మన్‌గా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం తన కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### కళా ఉత్సవ్ పోటీల్లో భవ్యశ్రీ జిల్లా ఫస్ట్

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చీపురుపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళలను ప్రోత్సహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలోని వేణుగోపాలపురం డైట్ కళాశాలలో కళాఉత్సవ్ పోటీలు నిర్వహించింది. ఇందులో భరతనాట్యం విభాగంలో చీపురుపల్లి కొత్తగవిడి వీధికి చెందిన పి.భవ్యశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 14 నుంచి అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శన ఇవ్వనుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేవారిని జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. భవ్యశ్రీ తండ్రి రామయ్య గరివిడి మండలంలోని కె.ఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.



### జయతి ఆలయంలో జెడ్పీచైర్మన్ పూజలు

మెంటాడ: మండలంలోని జయతి గ్రామంలోని 11వ శతాబ్దం నాటి భ్రమరాంబికా సహిత మల్లిఖార్జునస్వామి ఆలయాన్ని కుమార్తె సిరిసహస్రతో కలిసి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారి చేతులమీదుగా ప్రత్యేకపూజలు, అర్చనలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గేదెల సత్యం, వైస్ ఎంపీపీలు పొట్టంగి దుర్గ, ఈశ్వరరావు, నాయకులు వీరునాయుడు, లెంక రత్నాకర్‌నాయుడు, పి.అచ్చుత్, సతీష్, రెడ్డి రాజప్పలనాయుడు, దొగ్గ దేవుడు, లచ్చిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల

- డీఆర్వో ఎస్.డి.అనిత

విజయనగరం అర్బన్: మార్పులు, చేర్పుల అనంతరం ఓటర్ల తుదిజాబితా జనవరి 5న వెలువడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించిన ఓటరు, అభ్యంతరాల దరఖాస్తులను ఈ నెల 26 నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. అర్హత ఉన్న వారు ఓటుహక్కు పొందేందుకు ఫారం-6ను నేరుగా, ఆన్‌లైన్‌లో ఇవ్వవచ్చని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. వాటిని పరిశీలించి నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ జాబితాలో చేర్చుతామని వివరించారు. పేర్ల తొలగింపునకు సంబంధించి ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేశామని చెప్పారు. సమావేశంలో ఈఆర్వోలు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, నూకరాజు, సుధారాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, శ్రీనివాసరెడ్డి, కుటుంబరావు, దయానంద్, సోములు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తులతో తోటపల్లి కిటకిట

- అర్ధరాత్రి నుంచే తాకిడి
- నాగావళిలో విడిచిపెట్టిన దీపాలు

గరుగుబిల్లి: 'పోలిపాడ్యమి' సందర్భంగా 'ఓం నమః శివాయ..హరహర మహదేవ శంభో శంకర' 'ఏడు కొండలవాడ వేంకట రమణ..గోవిందా... గోవిందా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో తోటపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం హోరెత్తింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తులు సమీపంలోని నాగావళినది తీరానికి చేరుకుని, బుధవారం ఉదయం వరకు కార్తీకమాసంలో నెల రోజుల పాటు చేసిన కార్తీకమాస పూజలకు నదీతీరంలో వీడ్కోలు చెబుతూ మార్గశిర శుద్ధ పాడ్యమి నాడు మహాలక్ష్మిని ఆహ్వానిస్తూ తెప్పల్లో దీపాలను పెట్టి నదిలో విడిచిపెట్టారు. అనంతరం స్వామి వారికి తిరువీధి నిర్వహించి, భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, కురుపాం, జియ్యమ్మవలస తదితర మండలాలతోపాటు రాజాం, వీరఘట్టం, పార్వతీపురం ప్రాంతాలనుంచి సుమారు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వీవీ. అప్పలాచార్యులు మాట్లాడుతూ మార్గశిరశుద్ధ పాడ్యమినాడు జీవనదుల్లో స్నానంచేసి స్వామివారిని దర్శించుకుంటే, కోటి సూర్యగ్రహణాల స్నానం ఆచరించిన ఫలితం వస్తుందని పురాణాలలో పేర్కొన్నట్లు చెప్పారు. పాలకొండ డీఎస్పీ అజీజ్ పర్యవేక్షణలో చినమేరంగి స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కళాధర్ ఆధ్వర్యంలో భక్తులను క్యూలో ఉంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



భక్తులతో సందడిగా ఉన్న నాగావళి నది తీరం



స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



నాగావళినది తీరంలో స్వామివారికి హారతినిస్తున్న ఆలయ చైర్మన్ సత్యన్నారాయణ



ప్రసాదాలను వితరణ చేస్తున్న సిబ్బంది